క్లుప్తంగా

ఎడ్లబండ్ల పోటీలు ప్రారంభం



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: గుమ్మయ్యగారిపల్లిలోని మారెమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభించారు. 62 ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిలిచిన ఎడ్లకు రూ.40 వేలు, రెండో స్థానం రూ.30వేలు, మూడో స్థానం రూ.20 వేలు, నాల్గో స్థానం విజేతకు రూ.10వేలు బహుమతి ఆలయ కమిటీ ప్రకటించింది.

సామాజిక తనిఖీలపై ప్రజావేదిక



రొద్దంలో సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

రొద్దం: మండల వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి పథకం కింద చేపట్టిన పనులపై వారం రోజుల పాటు సామాజిక తనిఖీలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీలపై ప్రజావేదిక ద్వారా పనుల వివరాలు, చేసిన ఖర్చులు, కూలీలకు చెల్లించిన వేతనాలు తదితర నివేదికను సామాజిక బృందం సభ్యులు పంచాయతీల వారీగా చదివి వినింపించారు. మొత్తం రూ.13 కోట్ల పనులు చేపట్టగా, రూ.56 వేలు అవకతవకలు జరిగాయని, రికవరీకి ఆదేశించినట్లు ఏపీఓ రషీద్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ విజయప్రసాద్, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎస్ఆర్పీ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, అంబికా లక్ష్మినారాయణ

హిందూపురం: హిందూపురం నుంచి తిరుమలకు వేంకటేశ్వరస్వామి మాలధారులు చేపట్టిన పాదయాత్రను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాండురంగ నగర్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అంబికా లక్ష్మినారాయణ, రమేష్‌కుమార్, రాయల్ గోపాల్ పాల్గొన్నారు. అంతకుముందు అభయ ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు.

పరిగి: మండలం నుంచి రెండు బృందాలుగా భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు తన వంతుగా రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా కలశ స్థాపన



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అమరాపురం: గౌడనకుంటలో శనివారం ఘనంగా కలశ స్థాపన కార్యక్రమం జరిగింది. నూతనంగా తయారు చేసిన కలశాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆంజినేయస్వామి ఆలయంలో కలశ స్థాపన చేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

గుడిబండ: కల్లురొప్పం గ్రామానికి చెందిన శ్రీరంగప్ప దంపతులు ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీరంగప్ప సర్వేయర్‌గా విధులు నిర్వహించేవాడు. శనివారం సర్వేయర్ల సంఘం సభ్యులు, విశ్రాంతి ఆర్‌డీడీ భీమలింగయ్య కల్లురొప్పం వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.3 లక్షల నగదును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

చిలమత్తూరు: ఎంపీపీ పీఎస్ పురుషోత్తమరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, చిత్తూరు జెడ్పీచైర్మన్ వాసు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సమర్థనం ట్రస్ట్‌లో దివ్యాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ముక్కోటి దేవతలు..శతకోటి వందనాలు

- ఉత్తరద్వార దర్శనంతో పులకించిన భక్తులు



అగళిలో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామిని అలంకరించిన దృశ్యం



హిందూపురం: వైకుంఠంలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటరమణుడు శేషశయనంపై పవళించినట్లు అలంకరణ



ముద్దిరెడ్డిపల్లిలో పాండురంగస్వామికి పండ్లతో అలంకరణ

హిందూపురం/మడకశిర/ రొళ్ల/ గుడిబండ/ అమరాపురం/ అగళి/పరిగి/గోరంట్ల/లేపాక్షి/ పావగడ: ఇలనుంచి భువికి వచ్చిన ముక్కోటి దేవతలను ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. గోవింద నామస్మరణతో స్వామివార్ల మూలవిరాట్‌ను కనులారా వీక్షించి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని హిందూపురం, పెనుకొండ,మడకశిర నియోజకవర్గాల్లో శనివారం వేకువజాము నుంచే వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.హిందూపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్వామివార్లకు అలంకరణలు, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పేట వేంకటరమణస్వామి, శ్రీనివాస మందిరం వద్ద వేంకటేశ్వరస్వామి, ముక్కిడిపేటలోని నిత్య కళ్యాణ వేంకటేశ్వరస్వామి, ఎంఎఫ్‌రోడ్డులోని హైవగ్రీవ స్వామి, ఆర్‌పీజీటీరోడ్డులోని బాలాజీ ఆలయం, లక్ష్మీపురంలోని వేంకటేశ్వరస్వామి, రైల్వేరోడ్డులోని పద్మానాభస్వామి, గుడ్డం రంగనాథస్వామి, ముద్దిరెడ్డిపల్లిలోని పాండురంగ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాలు ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. పేట వేంకటరమణస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎస్.దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రసాదాలు అందించి పట్టుశాలువాలతో సత్కరించారు. కౌన్సిలర్లు గిరి, మల్లికార్జున పాల్గొన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేట వేంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి పేట వేంకటరమణస్వామి, లక్ష్మిపురంలోని బాలాజి ఆలయాల్లో పూజలు చేసి రూ.21,116ను అందజేశారు. లేపాక్షిలో రఘునాథస్వామి, తిరుమలదేవరప్పస్వామి, ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మడకశిరలోని కోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజ్,రాజశేఖర్, అంజలి, గోపి శ్రీవారిని దర్శించుకుని పూజలు చేయించారు. షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను జరిపారు. మడకశిర మండలం భక్తరపల్లి ,నీలకంఠేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆయాలు, రొళ్లలోని కొత్తపాళ్యం వేంకటేశ్వరస్వామి, రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. గుడిబండలోని వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. అమరాపురలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి, అగళిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్తర ద్వారాలు ఏర్పాటు చేశారు. పావగడలోని కృష్ణాపురంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి తైలాభిషేకం, నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ శాస్త్రి నవగ్రహ పూజలు నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తోటగేరి, ఎగువగడ్డకు వెళ్లే రహదారిలోని వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ పెద్దలు సన్మానించారు. పట్టణవాసులు వేంకటేశ్వర స్వామి, ఘనగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

సోమందేపల్లి: మండలంలోని చిన్న బాబయ్యపల్లిలో వైకుంఠ ఏకాదశి పూజల్లో హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. రామాలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రొళ్ల : అలంకరణలో కొత్త పాళ్యం వెంకటేశ్వరుడు



పెనుకొండ రూరల్: కనుమ వేంకటేశ్వరుడు



గుడిబండ: వేంకటేశ్వర స్వామి



మడకశిరలో కోటవేంకటేశ్వరస్వామి



పరిగి : లక్ష్మీవేంకటేశ్వర స్వామి



లేపాక్షి: అలంకరణలో రఘునాథస్వామి



పెనుకొండలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం: పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీఎన్ దీపిక పూజలు



వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న హిందూపుర మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ



హిందూపురం విరాళం అందిస్తున్న మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి



హిందూపురం: పేట వేంకటరమణ స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



హిందూపురం: నిత్యకళ్యాణ వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



మడకశిర: భక్తరపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో వస్తున్న భక్తులు



గోరంట్ల: గుంతపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



అమరాపురంలో పూజలందుకుంటున్న ప్రసన్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి



పెనుకొండలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పావగడ: ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



ఆరుమాకులపల్లిలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న దీపిక

చిలమత్తూరు: రాష్ట్రంలో పేదరికాన్ని పారదోలి ప్రతి కుటుంబం సంతోషంగా జీవించాలన్న సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. టేకులోడు పంచాయతీలో టేకులోడు, ఆరుమాకులపల్లి గ్రామాల్లో శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు మేలు చేకూర్చడమే నిజమైన అభివృద్ధి అని, ప్రజా సంక్షేమమే ప్రాధాన్యంగా జగనన్న శ్రమించారన్నారు. రాష్ట్రం బాగుండాలంటే సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పురంలో అడపాదడపా పర్యటించే ఎమ్మెల్యే బాలకృష్ణను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఎంపీటీసీ కవిత, నాయకులు జబీవుల్లా, శేషాద్రిరెడ్డి, రామచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’పై అవగాహన ర్యాలీ



గుడిబండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో శనివారం ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆడుదాం ఆంధ్రాపై విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పీఈటీల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొరార్జీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిబండ: పట్టణంలో నిశారం విద్యార్థులు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన ర్యాలి నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను వెలికితీయడమే ‘ఆడుదాం ఆంధ్ర’ లక్ష్యమన్నారు. ఏఓ నారాయణ, పీఈటీ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి శనివారం తెలిపారు. సచివాలయాల పరిధిలో ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న వారితో ఆటలు ఆడించాలని ఆయన కోరారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

హిందూపురం టౌన్: చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్‌శాఖ మంత్రి దేవ్‌సిన్హ చౌహాన్‌ను తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సురువు శ్రీలత మధు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ కాలనీలో కేంద్రం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను వివరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో చేనేత పరిశ్రమపై మూడు లక్షల పైగా జనాభా ఆధారపడి ఉందన్నారు. చేనేత వస్త్రాల జీఎస్టీ ఎత్తివేయాలని, చేనేత పరిశ్రమకు ముడి సరుకును ప్రభుత్వమే రాయితీతో అందించాలని, చేనేతలకు ముద్ర లోన్స్ బ్యాంకుల ద్వారా అందించాలని, ఆంధ్ర సిల్క్ బోర్డు ఏర్పాటు చేయాలని, పవర్ లూమ్స్‌కు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని 40 శాతం పెంచాలని, జీఎస్టీ ఎత్తి వేయాలని కోరారు. మేకల ఆంజనేయులు, రామాంజి, జానకి రామ్, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న చాంద్‌బాషా

హిందూపురం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కూరగాయల మార్కెట్ అధ్యక్షుడు చాంద్ బాషా జన్మదిన సందర్భంగా శనివారం కూరగాయల వ్యాపారస్తులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పాలు బ్రెడ్లు, వేడి నీటిని అందజేశారు. రోగులు, పర్యవేక్షులు, సిబ్బందికి అన్నదానం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం



మెళవాయిలో మాట్లాడుతున్న రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని

మడకశిరరూరల్: సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుందామని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని తెలిపారు. మెళవాయి గ్రామ సచివాలయం వద్ద శనివారం వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామ సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామ మధ్యలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందే సౌకర్యం కల్పించారన్నారు. సర్పంచ్ రంగనాథ్, ఎంపీటీసీ గంగరత్నమ్మ, తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ మూర్తి, మండల కన్వీనర్ రామిరెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హనుమంతరాయనపాళ్యంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కవిత, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి, అభివృద్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

అమరాపురం: స్థానిక అయ్యప్ప ఆలయం ఆవరణలో శనివారం ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వామి రామంజనేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారణ చేసిన స్వాములకు ఇరుముడి కట్టారు.

రైతే దేశానికి వెన్నెముక

పెనుకొండ: రైతే దేశానికి వెన్నెముక అని ప్రగతి, గ్లోబల్‌జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల అధినేత శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రగతి, గ్లోబల్‌జెన్‌లో రైతు దినోత్సవం నిర్వహించారు. రైతులు దేశానికి చేస్తున్న సేవలు, పంటల సాగుకు శ్రమిస్తున్న విధానాన్ని వివరించారు. రైతుల వల్లనే దేశ ప్రజలకు ఆహారం లభిస్తుందన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సోమందేపల్లి: మండలంలోని వెలగమాకులపల్లి తండాకు చెందిన చంద్రకళ (20) కుటుంబ కలహాలతో ఈ నెల 13న ఆత్మహత్యయత్నం చేసిన విషయం విదితమే. కొంత కాలంగా భర్త ప్రతాప్ నాయక్‌తో మనస్పర్థలు ఉండగా, ఈ నెల 13న ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పది రోజులుగా ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. భర్త ప్రతాప్ నాయక్ వేధింపులే కారణమని మృతిరాలి తల్లి ప్రమీళమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గురుపూజ సంకీర్తన

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సింగిరెడ్డి పల్లిలోని అంజనేయ స్వామి ఆలయం వద్ద సకల దేవతా స్వరూపమైన గోమాత, నగర సంకీర్తన ఉత్సావాన్ని నిర్వహించారు. శ్రీక్షేత్రం కై వరం తాతయ్య పూజల కార్యక్రమాల్లో భాగంగా కై వారం తాతయ్య ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తనలో భాగంగా గోమాతనుఊరేగిస్తూ భజనలు నిర్వహించారు. సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్, మహేష్, జగదీష్, నాగరాజు, ఆది, ప్రభాకర్, సురన్న,రాజప్ప, గంగాధరప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మడకశిరరూరల్: టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీవైఈఓ రంగస్వామి సూచించారు. నీలకంఠాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించి విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల గదిలోవారితో పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పీవీ ఆశయాలు కొనసాగిద్దాం

హిందూపురం టౌన్: తెలుగు బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు జమీల్ పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అయ్యప్ప ఆలయంలో హోమాలు

హిందూపురం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ముద్దిరెడ్డిపల్లి శివ బాలయోగి నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులు శనివారం ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహానికి పాలు, నెయ్యి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి హోమం, కలశపూజ నిర్వహించారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రిని అందజేసిన దృశ్యం

లేపాక్షి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉపాధ్యాయులు సూచించారు. మైదుగోళం ఎంపీయూపీఎస్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన జగనన్న క్రీడాసామగ్రిని శనివారం విద్యార్థులకు అందించారు. ఇటీవల ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విజయవాణిని సత్కరించారు. ఉపాధ్యాయులు క్షీరలింగేశ్వర్, సతీష్, మురళి, సత్యవతి, సల్మాన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.